# వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...

VC NEWS

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ మంగళవారం 01 అక్టోబర్ 2024

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:02 సంచిక: 76

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD




2లో

## వన్ నేషన్ పేరుతో ప్రజాస్వామ్యం ఖూనీ

**రుణమాఫీపై రైతులను మోసం చేసిన ప్రభుత్వం**

**ఇందిరాపార్క్ వద్ద దర్నాలో బిజెపి నేతల విమర్శలు**

"కాంగ్రెస్ రైతులను నమ్మించి మోసం చేసింది
హామీలు ఇచ్చి గద్దెనెక్కాక వాటిని మరచి పోయారు
ఇందిరాపార్క్ వద్ద దీక్షలో ఎంపి అర్వింద్ విమర్శలు"




# ఇచ్చిన హామీలు మరచిన కాంగ్రెస్

కేసీఆర్ ఇక అధికారంలోకి రాడని.. నేరుగా సీఎం రేవంత్‌రెడ్డి పేదల ఇళ్లను కూలుస్తున్నారని మండిపడ్డారు. ముస్లింలను ఒకలా.. హిందువులను మరోలా చూస్తున్నారని ధ్వజమెత్తారు. హిందువుల ఇళ్లను మాత్రమే హైడ్రా కూలుస్తుందని ఆరోపించారు. రేవంత్ ప్రభుత్వంలో రైతు రుణమాఫీలేదు.. రైతు భరోసా లేదు.. బోనస్ ముచ్చటే లేదని మండిపడ్డారు.

**హైదరాబాద్:** ఇచ్చిన హామీలు మరిచావా? మరిచిపోయినట్లు నటిస్తున్నావా'.. అంటూ భాజపా శాసనసభా పక్షనేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి.. సీఎం రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలో వచ్చాక 1000 మందికి పైగా రైతులు ఆత్మహత్య చేసుకున్నారని ఆరోపించారు. రైతు హామీల సాధన కోసం భాజపా ప్రజా ప్రతినిధులు ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద 24 గంటల దీక్ష చేపట్టారు. రేపు ఉదయం పదకొండు గంటల వరకు జరిగే ఈ దీక్షను ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొంగులేటి సుధాకర్ రెడ్డి ప్రారంభించారు. అన్నదాతలను మోసం చేసిన రాష్ట్ర ప్రభుత్వ తీరుకు నిరసనగా ఎంపీలు ఈటల రాజేందర్, డీకే అరుణ, రఘునందన్ రావు, ధర్మపురి అరవింద్, గోడెం నగేష్, కొండా విశ్వేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్యేలు ఏలేటి మహేశ్వర్ రెడ్డి, రామారావు పటేల్, ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా, పాల్వాయి హరీశ్‌బాబు దీక్షలో కూర్చున్నారు. ఈసందర్భంగా ఏలేటి మాట్లాడుతూ రైతులు ఓట్లేస్తే కాంగ్రెస్ గెలిచిందని గుర్తు చేశారు. రుణమాఫీ పూర్తిగా సాధ్యం కాదని తెలిసి కూడా కాంగ్రెస్ నేతలు హామీలు ఇచ్చారని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ విమర్శించారు. ఆరు గ్యారంటీల్లో ఒక్కటి కూడా పూర్తి చేసే సత్తా కాంగ్రెస్‌కు లేదని గతంలోనే చెప్పానని అన్నారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం మాత్రమే పూర్తిగా అమలు చేశారన్నారు. రూ.లక్ష రుణమాఫీ చేస్తామని చెప్పి అప్పట్లో కేసీఆర్ కూడా పూర్తి చేయలేదు. నిరుద్యోగులకు నిరుద్యోగభృతి హామీని కూడా ఆయన నెరవేర్చలేదు. రూ.లక్ష రుణమాఫీకి రూ.24 వేల కోట్లు అవసరమైతే.. కేవలం రూ.14 వేల కోట్లు ఇచ్చారు. అని ఈటల అన్నారు.

**కాంగ్రెస్ రైతులను నమ్మించి మోసం చేసింది**

కాంగ్రెస్ రైతులను నమ్మించి మోసం చేసిందని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ విమర్శించారు. ఎన్నికల్లో అనేక హామీలు ఇచ్చి గద్దెనెక్కాక ఇప్పుడు వాటిని మరచి పోయారని అన్నారు. ఏలేటి మహేశ్వర్ రెడ్డి బీజేఎల్పీ నేత అయినప్పటి నుంచి కాంగ్రెస్ ప్రభుత్వానికి చెందిన ఎన్నో స్కాములు, అవినీతిని బట్టబయలు చేశారని అన్నారు. కాంగ్రెస్‌కు హైదరాబాద్‌లో సీట్లు రాలేదు.. ఆ పార్టీ ఎమ్మెల్యేలకు గ్రామీణ

- మిగతా 2వ పేజీలో

# అక్టోబర్ 9న డీఎస్సీ నియామక పత్రాలు

55 రోజుల్లోనే డీఎస్సీ ఫలితాలు ఇచ్చాం

డిఎస్సీ ఫలితాలు విడుదల చేసిన సిఎం రేవంత్ రెడ్డి




2లో

## మూసీ సుందరీకరణకు హైడ్రాకు సంబంధం లేదు

మూసీలో మార్కింగ్ కూడా మేం చేపట్టడం లేదు

ఇదంతా మూసీ రివర్ ఫ్రంట్ కార్యక్రమన్న రంగనాథ్



2లో

## దసరాకు ప్రత్యేక బస్సులు

**అందుబాటులో 6వేల సర్వీసులు**



**హైదరబాద్:** దసరా పండుగను పురస్కరించుకుని తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ 6,000 ప్రత్యేక బస్సులను అందుబాటులో ఉంచనుంది. ఈ ప్రత్యేక బస్సులు ప్రస్తుత ప్రయాణికుల అవసరాలను తీర్చేందుకు, వివిధ ప్రాంతాలకు మరింత సౌకర్యంగా ప్రయాణం చేసేందుకు సర్వసాధారణ మైన మార్గాల్లో నడుపుతారు. ప్రయాణికులు ఆన్‌లైన్ లేదా బస్సు స్టేషన్‌ల ద్వారా టిక్కెట్లు బుక్ చేసుకోవచ్చు. ఈ ప్రత్యేక సేవలు దసరా సమయంలో అనేక మందికి ప్రయోజనకరంగా ఉంటాయి, తద్వారా వారు ఈ పండుగను సుఖంగా జరుపుకోగలుగుతారు. అయితే.. హైదరాబాద్ శివారు నుంచి దసరాకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు టీజీఎస్‌ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ తెలిపారు. ఓఆర్‌ఆర్ మీదుగా విజయవాడ, బెంగళూరుకు సర్వీసులు అందుబాటులో ఉంచనున్నట్లు ఆయన తెలిపారు. కరీంనగర్, నిజామాబాద్ మార్గాల్లో ఎలక్ట్రిక్ సూపర్ లగ్జరీ బస్సులు అందుబాటులో ఉండను న్నట్లు సజ్జనార్ వెల్లడించారు. ప్రయాణికుల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని సజ్జనార్ పేర్కొన్నారు.



2లో

# శని,ఆదివారాల్లోనే కూల్చివేతల మతలబు ఏంటి

కూల్చివేతలకు ముందు ఓనర్లకు సమయం ఇవ్వరా

చట్టప్రకారం నడుచుకోక పోతే హైడ్రాపైనే స్టే విధిస్తాం

హైడ్రా కూల్చివేతలపై హైకోర్టు ఆగ్రహం

వచ్చేనెల 15 వరకు విచారణ వాయిదా

## మూసీ రివర్ ఫ్రంట్ పెద్ద స్కామ్

లక్షన్నర కోట్లు పెట్టి ఏం సాధిస్తారు

ఇళ్లు ఇస్తామని..ఇప్పడు కూలుస్తారా

మూసీలో పట్టాలు ఇచ్చిందే కాంగ్రెస్ పార్టీ

నమామి గంగే ప్రాజెక్టుకే 40వేల కోట్లు

సిఎం రేవంత్ తీరుపై మండిపడ్డ కెటిఆర్



2లో

## దేవుడిని రాజకీయాలకు దూరంగా ఉంచండి



2లో

శ్రీవారి లడ్డూలో కల్తీ జరిగిందని ఎలా గుర్తించారు

లడ్డూలో కల్తీ నెయ్యి వినియోగంపై ఆధారాలు ఉన్నాయా

వివరాలు తెలియకుండా ముఖ్యమంత్రి ఎలా ప్రకటిస్తారు

ప్రస్తుత పరిస్తితుల్లో సిట్ దర్యాప్తుపై అనుమానాలు

సుప్రీం ధర్మాసనం సంచలన వ్యాఖ్యలు

# వన్ నేషన్ పేరుతో ప్రజాస్వామ్యం ఖూనీ

**హైదరాబాద్:** వన్ నేషన్ పేరిట హక్కులను కేంద్ర ప్రభుత్వం కాలరాస్తోందని సీపీఐ జాతీయ కార్యదర్శి కె. నారాయణ విమర్శలు చేశారు. వన్‌నేషన్ పేరుతో హక్కులను కాలరాస్తు ఆర్డినెన్సు లు తీసుకొచ్చే ఆలోచనలను కేంద్రం చేస్తోందని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.. అదే జరిగితే ప్రజాస్వామ్యం ఉండదని హెచ్చరించారు. రాజ్యాంగాన్ని పూర్తిగా నాశనం చేసేందుకు మోదీ ప్రభుత్వం ప్రయత్నాలు తీవ్రంగా చేస్తోందని ఆరోపించారు. ఈ విషయంపై దేశవ్యాప్తంగా పోరాటానికి సిద్ధమవు తామని వార్నింగ్ ఇచ్చారు. నేపాల్‌లో అధిక వర్షాల ప్రభావం బీహార్ మీద పడిందని చెప్పారు. దాన్ని పరిశీలించడానికి కేంద్ర పార్టీ బృందం వెళ్తోందని తెలిపారు. అక్కడ ఎలాంటి సహాయచర్యలు చేపట్టాలనే దానిపై సమావేశంలో చర్చించిన తర్వాత ప్రకటిస్తామని అన్నారు.. హైడ్రాపై నారాయణ షాకింగ్ కామెంట్స్ చేశారు. హైడ్రా చాలా హడావుడి చేస్తోందన్నారు. వికారాబాద్‌లో ఫిరంగి నాలానీ ప్రక్షాళన చేయాలని గతంలో వికారాబాద్ నుంచి ఇబ్రహీంపట్నం వరకు ర్యాలీ చేపట్టామని గుర్తుచేశారు. చెరువులు, కుంటలు ఉంటే భూ గర్భ జలాలు పెరుగుతాయని తెలిపారు. కమర్షియల్ కాంప్లెక్స్‌లు, అక్రమ నిర్మాణాలు కూల్చితే పెద్దగా సమస్యే లేదని అన్నారు. మూసీ పరివాహక ప్రాంతంలోని నిర్వాసితులకు ప్రత్యామ్నాయ మార్గాలు చూపించి మూసీ ప్రక్షాళన చేయాల్సిందేనని స్పష్టం చేశారు.. కొంతమంది అడ్డు పడుతారు.. సమస్య ఉంది కాబట్టి వ్యతిరేకిస్తారని అన్నారు.

# మూసీ రివర్ ఫ్రంట్ పెద్ద స్కామ్

**హైదరాబాద్:** మూసీ రివర్ ఫ్రంట్ పెద్ద స్కామ్ అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు ఆరోపించారు. లక్షన్నర కోట్లు కర్చు పెట్టి ఎవరిని ఉద్ధరిస్తారని అన్నారు. తెలంగాణ భవన్‌లో ఆయన సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. 'మూసీ ప్రాజెక్టు విషయంలో సీఎంని ప్రశ్నిస్తున్నా. మేం మొత్తం దేశంలో ఉండే అన్ని ప్రాజెక్టుల వివరాలు తెప్పించాం. నామామీ గంగే డీపీఆర్, ప్రాజెక్ట్ వివరాలు.. ప్రాజెక్టు పూర్వపరాలు తెప్పించాం. నమామీ గంగే ప్రాజెక్టుపై ఆసక్తితో వివరాలు తెప్పించాను. 2400 కిలోమీటర్ల గంగానది ప్రక్షాళన కోసం కేంద్రం ఈ ప్రాజెక్ట్ స్టార్ట్ చేసింది. ఈ ప్రాజెక్టుకు పెట్టిన బడ్జెట్ రూ.40వేలకోట్లు. 2400 కిలోమీటర్ల గంగా నదికి రూ.40వేలుకోట్లు. 50 కిలోమీటర్ల మూసీ సుందరీకరణ కోసం ఈ ముఖ్యమంత్రి రూ.1.50లక్షలకోట్ల ఖర్చు అవుతుందని సీఎం చెబుతున్నారు. దీన్ని స్కామ్ అనక ఏమనాలి. దీనివెనుక ఉన్న మతలబు ఏంటీ? చెప్పాలి కదా. అనుమతులు ఇచ్చిన ఇండ్లను కూల్చడమంటే ప్రభుత్వానికి తన వ్యవస్థ మీద, తన యంత్రాంగం, పరిపాలనపై తనకే పట్టులేనితనానికి నిదర్శనం కాదా? అని అడుగుతున్నానన్నారు. మున్సిపల్ మంత్రిగా నేను ఎనిమిదేళ్లు పని చేశాను. కూల్చాల్సి వస్తే.. మొదట కూల్చాల్సింది హైడ్రా కమిషనర్ ఆఫీస్‌ను. కమిషనర్ ఎక్కడ కుసున్నడో.. బుద్ధ భవన్ నాలామీదున్న ఉన్నది. దాంట్లోనే ఎలక్షన్ కమిషనర్ ఉన్నడు. హైడ్రా కమిషనర్ ఉన్నరు. అందులో ఉమెన్స్ కమిషన్ ఉన్నది. మొదట ఆ భవనం కూల్చాలి. రెండోది ఏ జీహెచ్ఎంసీ పర్మిషన్‌లు ఇస్తదో.. ఆ జీహెచ్ఎంసీ కార్యాలయాన్ని కూల్చాలి. జీహెచ్ఎంసీ ఆఫీస్ కూడా నాలాపైనే ఉన్నది. మరి ఇతరులకు సుద్దులు చెప్పే ముందు ఇక్కడి నుంచే మొదలిపెట్టాలి. నాకు తెలిసి సీఎంకి అవకాశం ఇస్తే.. కొత్తగా కట్టుకున్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయం కూలుస్తడు. ఆయనో లక్ష్యం పెట్టుకున్నడు. కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా పెట్టుకున్నడు. సెక్రటేరియట్ చూడంగనే అందరికీ కేసీఆర్ గుర్తుకు వస్తడు. మొన్న గణపతి బొప్ప మోరియా అనుకుంటా



వెళ్లారు. అక్కడికి రాంగనే కేసీఆర్ గుర్తుకు వచ్చిండు.. కేసీఆర్ పాటలు పెట్టంగనే ముఖ్యమంత్రికి ఇరిటేషన్ వస్తున్నది. మూసీ బాధితుల ఆక్రందనలు చేస్తున్నా.. ఇబ్బంది పడుతుంటే.. నిన్న మొన్నటి వరకు డైలాగ్‌లు కొట్టిన మీ అధినాయకులు ఎక్కడా? మీ రాహుల్ గాంధీ యేడీ? మీ ప్రియాంక గాంధీ ఎక్కడ? అని ప్రశ్నించారు. కాళేశ్వరం అనేది ప్రపంచంలోనే అతిపెద్ద మల్టీస్టేజ్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు. ఒక పంటకు 40లక్షల ఎకరాలకు నీళ్లిచ్చే ప్రాజెక్టు. పరిశ్రమలకు 10శాతం నీళ్లు వస్తాయి. హైదరాబాద్ మహానగరంతో పాటు వేలాది గ్రామాలకు తాగునీరు ఇచ్చే ప్రాజెక్టు.

హైదరాబాద్ నెత్తిమీద శాశ్వతంగా ఒక కుండపెట్టినట్టే కరువు తీర్చే కల్పతురువు కాళేశ్వరం. కాళేశ్వరం కట్టం తర్వాత వరిసాగులో భారతదేశంలో తెలంగాణ టాప్. ఇది కాళేశ్వరం పుణ్యం కాదా? రూ.లక్షకోట్ల పెట్టుబడితో ఏం జరిగిందంటే.. తెలంగాణ వరిసాగులో టాప్‌గా నిలిచింది' అన్నారు. కాళేశ్వరంతో తాగునీటి సమస్య పోయింది. హైదరాబాద్‌కు తాగునీటి సమస్య రానే రాదు. ఇప్పటికే మూసీ కింద ఉన్న ఆయకట్టు కాకుండా కొత్తగా ఏమన్న వస్తుందా? మూసీ ప్రాజెక్టులో రిజర్వాయర్ ఉన్నదా? పంప్ హౌస్ ఉన్నదా? అండర్‌గ్రౌండ్ టన్నెల్ ఉన్నదా? ఏం లేకున్నా రూ.1.50లక్షలకోట్లంటే స్కామ్ కాదా? అని తెలిపారు.

థేమ్స్ నదికి కూడా ఖర్చుపెట్టింది దాదాపు రూ.40వేలకోట్లు. వీటన్నింటికంటే అద్భుతాన్ని ఆవిష్కరిస్తా నంటే.. రిటర్న్ ఆన్ ఇన్వెస్ట్‌మెంట్ ఎంత? రాష్ట్ర ప్రజలకు ఒనగూరే ప్రయోజనం ఎంత? ఎవరి కోసం మూసీ ప్రాజెక్టు చేపడుతున్నవ్ చెప్పాలి. ఇంత వరకు రైతుబంధు దిక్కులేదు. కొత్త హామీలు కాదు.. ఇచ్చిన హామీలు ఏమాయ్యాయంటూ.. పెన్షన్లు ఎగ్గొట్టావంటే చెప్పేటోడు లేడు' కేటీఆర్ మండిపడ్డారు.వంద రోజుల్లో చేస్తామన్న పనులను 300 రోజులు దాటినా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయడం లేదని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆరోపించారు. వంద రోజుల్లోనే హామీలన్నీ నెరవేరుస్తామని పత్రికల్లో ప్రకటనలు సైతం ఇచ్చారని ఎద్దేవా చేశారు. ఇప్పటివరకు ఒక్క గ్యారంటీ కూడా అమలు చేయలేదన్నారు. మూసీ పరివాహక ప్రజల పట్ల సీఎం రేవంత్ రెడ్డి వ్యవహరిస్తోన్న తీరు సరైంది కాదు. కాంగ్రెస్ పార్టీ హయాంలోనే ఇళ్లకు పట్టాలు వచ్చాయని పలువురు ప్రజలు చెప్తున్నారు. రిజిస్ట్రేషన్ చేసినప్పుడు లేని అభ్యంతరం ఇప్పుడెందుకు చెప్తున్నారని పేదలు అడుగుతున్నారు. గతంలో 60 ఏళ్లు పాలించిన కాంగ్రెస్ పార్టీ.. చెరువులకు హద్దులు ఎందుకు గుర్తించలేదన్నారు. ఎఫ్‌టీఎల్ నిర్మాణాలకు అనుమతి ఇచ్చిన వారిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు? అని అన్నారు. ఇళ్లు కట్టిస్తామన్నారు కానీ.. కూల్చుతామని ఎన్నికల ముందు చెప్పారా? సాగరహారం లాంటి ఉద్యమాలు మళ్లీ రావాల్సిన అవసరం ఉంది. ప్రజలు తిరగబడితే మంత్రులు ఊళ్లల్లో కూడా తిరగలేరు. పేద ప్రజల ఇళ్లను ఇలా కూల్చేస్తూ ఉంటే మేం చూస్తూ ఊరుకోం. ఇకపై బుల్డోజర్లకు భారాస నేతలు అడ్డుగా ఉంటారని కేటీఆర్ హెచ్చరించారు.

# దేవుడిని రాజకీయాలకు దూరంగా ఉంచండి

**న్యూఢిల్లీ:** తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీలో కల్తీ నెయ్యి వాడకం వివాదంపై సుప్రీంకోర్టు ఘాటుగా స్పందించింది. దేవుడిని రాజకీయాలకు దూరంగా ఉంచాలని హితవు పలికింది. లడ్డూలో కల్తీ నెయ్యి వినియోగించారనడానికి ఆధారాలు ఏమైనా ఉన్నాయా అని ప్రభుత్వం తరపున న్యాయవాది ముకుల్ రోహత్గీని జస్టిస్ బి ఆర్ గవాయ్, జస్టిస్ కేవీ వి బాలకృష్ణన్ ధర్మాసనం ప్రశ్నించింది. కల్తీ నెయ్యిని లడ్డూలో వాడారో లేదో పూర్తిగా తెలియకుండా ముఖ్యమంత్రి ఎలా ప్రకటన చేస్తారని సుప్రీంకోర్ట్ నిలదీసింది. ఈ అంశంపై విచారణకు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని(సిట్) నియమించిన అనంతరం కల్తీ నెయ్యిపై మీడియా ముందు ప్రకటన చేయడంపై ధర్మాసనం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఇటువంటి ప్రస్తుత పరిస్థితుల్లో కొత్తగా నియమించిన సిట్ సరిగ్గా విచారణ జరపగలదా? అన్న సందేహాలు ఉన్నాయని న్యాయస్థానం పేర్కొంది. స్వామి వారి లడ్డూ ప్రసాదం తయారీలో కల్తీ నెయ్యిని వినియోగించినట్లు ఎలా తెలిసిందంటూ సుప్రీంకోర్ట్ సందేహం వ్యక్తం చేసింది. అలాగే స్వామి వారి ప్రసాదం లడ్డూని పరీక్షల కోసం ల్యాబ్‌కి ఎప్పుడు పంపారని ముకుల్ రోహత్గిని ధర్మాసనం ప్రశ్నించింది. ఈ అంశంపై కేంద్ర ప్రభుత్వం విచారణ జరిపితే బావుంటుందని ధర్మాసనం అభిప్రాయపడింది. అనంతరం ఈ కేసు విచారణను జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కేవీ బాలకృష్ణన్ ధర్మాసనం గురువారానికి వాయిదా వేసింది. ఈ మేరకు తిరుమల లడ్డూ వివాదంపై జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కేవీ విశ్వనాథన్ ధర్మాసనం సోమవారం విచారణ జరిపింది. తిరుమల స్వామివారి లడ్డూ ప్రసాదం తయారీలో కల్తీ నెయ్యి వినియోగించి నట్లు ఆరోపణలు నేపథ్యంలో ఈ అంశంలో నిజం నిగ్గూ తేల్చాలంటూ బీజేపీ సీనియర్ నేత సుబ్రహ్మణ్య స్వామి, వైసీపీ సీనియర్ నేత వైవీ సుబ్బారెడ్డి వేర్వేరుగా సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలు చేసిన సంగతి తెలిసిందే. వీటిపై సుప్రీంకోర్టులో సోమవారం విచారణ జరిపింది. తత ప్రభుత్వ హయాంలో తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీలో కల్తీ నెయ్యి వినియోగించినట్లు ఎన్‌డీడీబీ నివేదిక స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా ఉన్న శ్రీవారి భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘోర అపచారం జరిగిన నేపథ్యంలో శ్రీవారి ఆలయంలో శాంతి హోమాన్ని తిరుమల తిరుపతి దేవస్థానం నిర్వహించింది. అలాగే



సంప్రోక్షణ కార్యక్రమాన్ని సైతం చేపట్టింది. అందులోభాగంగా ఆనంద నిలయంతో పాటు తిరుమల మాఢవీధుల్లో సైతం సంప్రోక్షణ నిర్వహించింది. మరోవైపు తిరుమల లడ్డూ కల్తీ నెయ్యి వ్యవహారాన్ని ప్రత్యేక దర్యాప్తు బృందంతో విచారణ జరపాలని చంద్రబాబు ప్రభుత్వం నిర్ణయించింది. గుంటూరు ఐజీ సర్వ శ్రేష్టి త్రిపాఠి నేతృత్వంలో సిట్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. దీంతో శనివారం సిట్ బృందం తిరుమల చేరుకుని.. తన దర్యాప్తును ప్రారంభించింది.

# శని,ఆదివారాల్లోనే కూల్చివేతల మతలబు ఏంటి

హైదరాబాద్: హైడ్రా తీరుపై తెలంగాణ హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్‌లో కూల్చివేతలపై పలువురు ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దీనిపై సోమవారం విచారణ జరిగింది. విచారణకు హైడ్రా కమిషనర్ రంగానథ్ వర్చువల్‌గా, అమీన్‌పూర్ తహసీల్దార్ కోర్టులో హాజరై వివరణ ఇచ్చారు. శని, ఆదివారాలు, సూర్యాస్తమయం తర్వాత ఎందుకు కూల్చివేతలు చేపడుతున్నారని హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆదివారం మీరు ఎందుకు పని చేయాలని ప్రశ్నించింది. సెలవుల్లో ఎందుకు నోటీసులు ఇచ్చి, అత్యవసరంగా కూల్చివేస్తున్నారని అడిగింది. శని, ఆదివారాల్లో కూల్చివేయొద్దని గతంలో కోర్టు తీర్పులున్నాయని గుర్తు చేసింది. కోర్టు తీర్పుల విషయం కూడా తెలియదా అని తహసీల్దార్‌ను ప్రశ్నించింది. గతంలో మీరు కూల్చివేసిన కేసుపై స్టే

విధించిన విషయం తెలియదా? అని అడిగింది. చట్టప్రకారం నడుచుకోకపోతే ఇబ్బందులు పడాల్సి వస్తుందని తహసీల్దార్‌ను హెచ్చరించింది. రాజకీయ నేతలు, ఉన్నతాధికారులు చెప్పినంత మాత్రాన అక్రమంగా ముందుకు వెళ్లొద్దు. ఇల్లు కూల్చే ముందు యజమానికి చివరి అవకాశం ఏమైనా ఇచ్చారా? ప్రభుత్వ ఆస్తుల రక్షణ పేరుతో అమాయకులను ఇబ్బందులకు గురి చేస్తారా? అని ఉన్నత న్యాయస్థానం ప్రశ్నించింది. కోర్టు అడిగిన ప్రశ్నలకే సమాధానం ఇవ్వాలని హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు సూచించింది. కూల్చివేతకు యంత్రాలు, సిబ్బందిని కోరడంతో సమకూర్చామని బదులివ్వగా.. చార్మినార్ కూల్చివేతకు తహసీల్దార్ యంత్రాలు, సిబ్బంది అడిగితే ఇస్తారా? అని హైకోర్టు ప్రశ్నించింది. హైడ్రా ఇదే విధంగా ముందుకు వెళ్తే స్టే ఇవ్వాల్సి వస్తుందని హెచ్చరించింది. ఖాళీ చేయనంత మాత్రాన అత్యవసరంగా కూల్చాల్సిన అవసరం ఏముంది?పొలిటికల్ బాస్‌లను సంతృప్తిపరిచేందుకు, పై అధికారులను మెప్పించేందుకు చట్టవిరుద్ధంగా పని చేయొద్దు. చనిపోయే వ్యక్తిని కూడా చివరి కోరిక అడుగుతారు కదా? ఆదివారం కూల్చివేతలు హైకోర్టు తీర్పునకు వ్యతిరేకమని తెలియదా? అధికారులు చట్టవ్యతిరేకంగా పనిచేస్తే ఇంటికెళ్తారు.. జాగ్రత్త అంటూ హెచ్చరించింది. మూసీపై కూడా 20 లంచ్ మోషన్ పిటిషన్లు దాఖలయ్యాయి. ఇది అరుదైన కేసుగా భావించే అధికారులను విచారణకు పిలిచాం. జీవో ప్రకారం హైడ్రాకు ఎన్నో విధులు ఉన్నాయి. మిగతావి పట్టించుకోకుండా కూల్చివేతలపైనే దృష్టి పెట్టారు. ట్రాఫిక్ సమస్యపైనా హైడ్రాకు బాధ్యత ఉంది. కానీ దాని గురించి ఏమాత్రం పట్టించుకోవట్లేదు. మాదాపూర్‌లో ప్రయాణం ఎంత సమయం పడుతుందో తెలుసు కదా? నిబంధనలు పాటించకుంటే హైడ్రా ఏర్పాటు జీవోపై స్టే ఇవ్వాల్సి వస్తుంది. సబ్ రిజిస్ట్రార్ రిజిస్ట్రేషన్ చేస్తేనే సామాన్యులు ఇళ్లు నిర్మిస్తున్నారు. స్థానిక సంస్థ అనుమతి ఇస్తేనే ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నారు. ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయ లోపంతో సామాన్యులు నష్టపోవాల్సి వస్తోంది. ఆదివారం కూల్చివేతలు వద్దని త్రిసభ్య ధర్మాసనం తీర్పు ఉంది. అక్రమ నిర్మాణాలు అనిపిస్తే సీజ్ చేయవచ్చు కదా? హైడ్రా ఏర్పాటు అభినందనీయం.. పనితీరే అభ్యంతరకరం. అమీన్‌పూర్ తహసీల్దార్, హైడ్రా కమిషనర్ తీరు అసంతృప్తికరం. ఒక్కరోజులో హైదరాబాద్‌ను మార్చాలనుకోవడం సరికాదు. ఎఫ్టీఎల్ నిర్ధరించకుండా అక్రమాలు అని ఎలా తేలుస్తారని హైకోర్టు ప్రశ్నించింది. విచారణను అక్టోబర్ 15కు వాయిదా వేసింది. అప్పటివరకు యథాతథ స్థితి కొనసాగించాలని హైడ్రా, అమీన్‌పూర్ తహసీల్దార్‌ను ఆదేశించింది. కౌంటర్లు దాఖలు చేయాలని చెప్పింది. ప్రభుత్వ ఆస్తుల రక్షణ పేరుతో అమాయకులను ఇబ్బందులకు గురిచేస్తారా ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఆదివారం కూల్చివేతలు హైకోర్టు తీర్పునకు వ్యతిరేకమని తెలియదా అంటూ హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు న్యాయమూర్తి ప్రశ్నించారు. అమీన్‌పూర్‌పైనే మాట్లాడాలని, కావూరిహిల్స్ గురించి అడగలేదంటూ కోర్టు అడిగిన ప్రశ్నలకే సమాధానం ఇవ్వాలని.. జంప్ చేయొద్దని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మార్వో విజ్ఞప్తి మేరకు చర్యలు తీసుకున్నామన్నా రంగనాథ్ వివరణపై అసహనం వ్యక్తం చేశారు. ఎమ్మార్వో అడిగితే గుడ్డిగా చర్యలు తీసుకుంటారా అని ప్రశ్నించారు. ఎమ్మార్వో అడిగితే చార్మినార్, హైకోర్టును కూడా కూల్చేస్తారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. హైడ్రాకు ఇదే విధంగా ముందుకు వెళ్తే స్టే ఇవ్వాల్సి వస్తుందన్నారు. కూల్చివేతలు తప్ప వేరే పాలసి లేదని, ఇది ప్రజల అభిప్రాయమన్నారు.

ఈ సందర్భంగా కోర్టులను ఎంతో గౌరవిస్తున్నామని న్యాయమూర్తికి రంగనాథ్ తెలిపారు. మూసీపై కూడా 20 లంచ్‌మోషన్ పిటిషన్లు దాఖలయ్యాయని న్యాయమూర్తి వెల్లడించారు. ప్రభుత్వ వ్యవస్థల మధ్య సమన్వయం లేదని చెప్పారు.

# అక్టోబర్ 9న డీఎస్సీ నియామక పత్రాలు

**హైదరాబాద్:** అక్టోబర్ 9వ తేదీన ఎల్బీ స్టేడియంలో డీఎస్సీ నియామక పత్రాలు అందజేస్తామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం ఉదయం సచివాలయంలో డీఎస్సీ పరీక్షల ఫలితాలను సిఎం రేవంత్ విడుదల చేసారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ కేవలం 55 రోజుల్లోనే డీఎస్సీ ఫలితాలు ఇచ్చామని తెలిపారు. 1:3 నిష్పత్తిలో వెరిఫికేషన్ ఉంటుందని చెప్పారు. అక్టోబర్ 9న ఎల్బీ స్టేడియంలో నియామక పత్రాలు ఇస్తామని ప్రకటించారు. పదేళ్లలో గత ప్రభుత్వం ఒకే ఒక్క డీఎస్సీ ఇచ్చిందని విమర్శించారు. టీజీపీఎస్సీని ప్రక్షాళన చేశామని, త్వరలోనే గ్రూప్ 1 పరీక్షలు నిర్వహించి ఫలితాలు ఇస్తామని సిఎం రేవంత్ రెడ్డి వివరించారు.డీఎస్సీ 2024 ఫలితాలను విడుదల చేసిన తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి మరో గుడ్ న్యూస్ చెప్పారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకు పరిస్థితులు ఖాళీలు చూసుకొని డీఎస్సీపై నిర్ణయం తీసుకుంటామని అన్నారు. ఉద్యోగ నియామక పక్రియ అనేది నిరంతరం సాగేదని అన్నారు. ఇప్పుడు డీఎస్సీ పక్రియ నియామక పక్రియ పూర్తి అయిన తర్వాత ఇందులో ఉన్న మిగిలిపోయే ఖాళీలు, కొత్తగా ఏర్పడే ఖాళీలు తెప్పించు కొని డీఎస్సీపై నిర్ణయం తీసుకుంటామన్నారు. కచ్చితంగా ప్రతి ఏడాది జాబ్ క్యాలెండర్ ప్రకారమే ఉద్యోగాలు నియామకాలు జరుగుతాయన్నారు. ప్రభుత్వంలో ఉన్న ఏ ఉద్యోగం కూడా ఖాళీ లేకుండా భర్తీ చేస్తామని అన్నారు. త్వరలోనే గ్రూప్ 1 రిజల్ట్స్ కూడా ఇస్తామన్నారు. గత ప్రభుత్వం రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేసింది కానీ అక్కడ కనీస వసతులు కల్పించడంలో పూర్తి ఫెయిల్ అయిందన్నారు. పిట్టగూళ్లలో, పౌల్ట్రీ ఫామ్‌లో పేదల పిల్లలను వదిలేశారని ఆరోపించారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేయబోతున్నామని రేవంత్ ప్రకటించారు. ప్రతి నియోజకవర్గానికి ఇరవై నుంచి ఇరవై ఐదు ఎకరాలల్లో ఈ విద్యాసంస్థలు ఏర్పాటు చేస్తున్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓబీసీ మైనార్టీ విద్యార్థులను ఒకే చోట విద్యను అందించబోతున్నామని తెలిపారు. యూనివర్శిటీ స్థాయిలో ఈ రెసిడెన్సియల్ స్కూల్స్ ఉంటాయని తెలిపారు. పైలెట్ ప్రాజెక్టు కింద ముందుగా కొడంగల్, మధిరలో ఏర్పాటు చేస్తున్నామని ఇప్పటికే పనులు కూడా ప్రారంభమైనట్టు పేర్కొన్నారు. టెట్ తర్వాతనే డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. త్వరలోనే గ్రూప్ వన్ ఫలితాలు విడుదల చేస్తామని ప్రకటించారు. విద్యాశాఖ అధికారులు అతి తక్కువ సమయంలో ఉద్యోగాల భర్తీకి కృషి చేశారని అన్నారు. వారికి అభినందనలు తెలిపారు. 26ఆప్షన్ కింద డీఎస్సీ నిర్వహించామని వివరించారు. 1:3ప్రాతిపాదికన ఫలితాల ప్రకటించిన తర్వాత సర్టిఫికెట్ వెరిఫికేషన్ జరుగుతుందని తెలిపారు. దసరా లోపే 9అక్టోబర్ నాడు ఉద్యోగ నియామక పత్రాలు అందజేస్తామని స్పష్టం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఒకే ఒక్క నోటిఫికేషన్ వేసిందని మండిపడ్డారు.

# మూసీ సుందరీకరణకు హైడ్రాకు సంబంధం లేదు

హైదరాబాద్: మూసీ సుందరీకరణపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ కీలక ప్రకటన చేశారు. నదికి ఇరువైపులా సర్వేలతో హైడ్రాకు సంబంధం లేదన్నారు. మూసీ నది పరిధిలో నివసిస్తున్న వారిని హైడ్రా తరలించడం లేదని, నదిలో ఎలాంటి కూల్చివేతలు చేపట్టడం లేదన్నారు. నదీ పరివాహక ప్రాంతంలోని ఇళ్లపై హైడ్రా మార్కింగ్ చేయడం లేదని, మూసీ సుందరీకరణ అనేది ప్రత్యేక ప్రాజెక్టని చెప్పారు. దానిని మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చేపడుతోందని వెల్లడించారు. మూసీ నదీ పరివాహక ప్రాంతంలో ఇటీవల జరుగుతున్న కొన్ని ఆందోళనలపై హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ వివరణ ఇచ్చారు. నదీ పరివాహక ప్రాంతంలో నివాసితుల భద్రత, పునరావాసం, కూల్చివేతలకు సంబంధించిన వార్తలు వెలువడుతున్న నేపథ్యంలో, కమిషనర్ కొన్ని ముఖ్యమైన వివరాలను వెల్లడించారు. మూసీ నదికి ఇరువైపులా జరుగుతున్న సర్వేలు హైడ్రాకు సంబంధించినవి కాదని స్పష్టంగా అవగాహన చేయాలని కోరారు. ఈ సర్వేలు హైడ్రా చట్టం లేదా ప్రాజెక్టుకు సంబంధించినవి కాదని తెలిపారు. మూసీ నదీ పరివాహక ప్రాంతంలో నివసిస్తున్న ప్రజలను హైడ్రా తరలించడం లేదని ఆయన స్పష్టం చేశారు. నివాసితులపై జరుగుతున్న ఇబ్బందులు తప్పనిసరిగా నివారించబడాలని హైడ్రా సంస్థ భావిస్తోందన్నారు.

# ఇచ్చిన హామీలు మరచిన కాంగ్రెస్

ప్రాంతాల్లో ఓట్లు వచ్చాయని చెప్పారు. సోమవారం ఇందిరా పార్క్ వద్ద బీజేపీ ఆధ్వర్యంలో రైతు దీక్ష జరిగింది. ఈ దీక్షలో ఎంపీ ధర్మపురి అరవింద్ మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డిపై తీవ్ర విమర్శలు గుప్పించారు. అందుకే ఇక్కడ పేదల ఇళ్లను కూలుస్తు న్నారని విమర్శించారు. తొమ్మిదేళ్లు తెలంగాణలో ప్రజా కంటగింపు పాలనను చూశామన్నారు. కేసీఆర్ ఇక అధికారంలోకి రాడని.. నేరుగా సీఎం రేవంత్‌రెడ్డి పేదల ఇళ్లను కూలుస్తున్నారని మండిపడ్డారు. ముస్లింలను ఒకలా.. హిందువులను మరోలా చూస్తున్నారని ధ్వజమెత్తారు. హిందువుల ఇళ్లను మాత్రమే హైడ్రా కూలుస్తుందని ఆరోపించారు. రేవంత్ ప్రభుత్వంలో రైతు రుణమాఫీలేదు.. రైతు భరోసా లేదు.. బోనస్ ముచ్చటే లేదని మండిపడ్డారు. ప్రమాదవశాత్తు పంట నష్టం జరిగితే ఆదుకునే నాథుడే లేరని ఎంపీ అరవింద్ అన్నారు. కేసీఆర్.. ఒక ఎకరాకు కోటి సంపాదిస్తున్నాడట.. కోటి సంపాదన ఎలా సాధ్యమో తెలుసుకునేందుకు ప్రభుత్వం నుంచి ఒక టీమ్‌ను ఆయన ఫాంహౌస్‌కు కూడా పంపాలని కోరారు. పరిశీలించడానికి రేవంత్ టీంను ఏర్పాటు చేయాలని కోరారు. రైతులకు గైడ్ చేయాలని సూచించారు. కేసీఆర్ దిగిపోయాక ఆయన మాటలను చాలా మిస్ అవుతున్నానని అన్నారు. ఉద్యమ సమయంలో ఆయన పులిలా ఉన్నారు.. ఇప్పుడు పిల్లి లాగా అయ్యారని ఎంపీ అరవింద్ విమర్శలు చేశారు. కేసీఆర్.. తెలంగాణను నట్టేటా ముంచారని ఎంపీ అరవింద్ ÷ర్ అయ్యారు. ఇప్పుడు కాంగ్రెస్ కూడా అదే దారిలో పోతోందని విమర్శించారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు అగ్రికల్చర్ పాలసీ ఎందుకు తీసుకురాలేదని ఎంపీ అరవింద్ ప్రశ్నించారు. మాజీ మంత్రి కేటీఆర్‌కు అల్లం, పసుపుకు తేడా తెలియదని.. ఆయన కూడా ఈరోజు మాట్లాడుతున్నారని ఎంపీ అరవింద్ ఎద్దేవా చేశారు. కేసీఆర్‌లాగే వరి మాత్రమే వేసుకునే పరిస్థితిని కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చిందని అన్నారు. రేవంత్ ప్రభుత్వంలో రైతు భరోసా కాదు.. బీమా కూడా అందట్లేదని ఎంపీ అరవింద్ ఆరోపించారు. మాజీ ప్రధాని ఇందిరమ్మను కూడా ప్రశాంతంగా ఉండనివ్వ కుండా ఇంకా బదనాం చేస్తున్నారని అన్నారు. ప్రతి మండలానికి ఇంటర్నేషనల్ స్కూళ్లను ప్రారంభిస్తానని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారని గుర్తుచేశారు. రాష్ట్రంలో ఇదే పరిస్థితి ఉంటే.. కేసీఆర్‌కు పట్టిన గతే రేవంత్‌కు పడుతుందని చెప్పారు. ఇప్పటికైనా రైతులను ఆదుకోవాలని కోరారు. కేసీఆర్‌ను ఆయన ఫ్యామిలీని చూసి ఇప్పటి పరిస్థితుల్లో ఎవరూ ఓటు వేయరని అన్నారు.




# ఎరుపెక్కిన

## ఉస్మానియా యూనివర్సిటీ.

- ఘనంగా ప్రారంభమైన “పిడిఎస్ యు 50 వసంతాల” మహాసభ
- “జీనా హైతో మర్నాసికో, కదం కదం పర్ లడ్నా సీకో” అంటూ హోరెత్తిన నినాదాలు.
- సమరశీల పోరాట స్ఫూర్తి “పిడిఎస్ యు”.
- రిటైర్డ్ జడ్జ్ కోల్సే పటేల్, ప్రొఫెసర్ హరగోపాల్, ప్రొఫెసర్ ఖాసిం.





**వేగుచుక్క న్యూస్, హైదరాబాద్, సెప్టెంబర్ 30:**

పిడిఎస్ యు ఏర్పడి 50 వసంతాలు ముగించుకుంటున్న సందర్భంగా ఉస్మానియా యూనివర్సిటీలో ఆర్ట్స్ కళాశాల నుండి ఠాగూర్ ఆడిటోరియం వరకు సోమవారం భారీ ప్రదర్శన నిర్వహించారు. అరుణోదయ డప్పు బృందాలతో, వేలాది మంది విద్యార్థులతో, హోరెత్తే నినాదాలతో భారీ ప్రదర్శన నిర్వహించారు. “జీనా హైతో మర్నాసికో, కదం కదం పర్ లడ్నా సీకో” అంటూ జార్జి జంపాల అమరుల వారసత్వంతో విద్యార్థులు, పూర్వ విద్యార్థులు ఉత్సాహంగా, ఉద్వేగంగా సాగారు. ఠాగూర్ ఆడిటోరియం దగ్గర చేసిన విద్యార్థి అమరవీరులకు ప్రధాన నాయకత్వం పుష్పాంజలి సమర్పించారు. పిడిఎస్యు రాష్ట్ర అధ్యక్షులు పెద్దింటి రామకృష్ణ అధ్యక్షతన, హైకోర్ట్ రిటైర్డ్ జడ్జ్ కోల్సే పటేల్, ప్రొఫెసర్ హరగోపాల్, సీపీఐ (ఎం.ఎల్) మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు, ప్రొఫెసర్ వినాయక్ రెడ్డి, ప్రొఫెసర్ ఖాసిం, ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ, పిడిఎస్ యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నామాల ఆజాద్ ప్రొఫెసర్ కొండ నాగేశ్వరరావు, ప్రొఫెసర్ అనురాధ, ఇతర రాష్ట్రాల ప్రతినిధులు వేదికపై ఆసీనులయ్యారు. ముందుగా పిడిఎస్ యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నామల ఆజాద్ అమరవీరులకు సంతాపం ప్రకటించగా సభ రెండు నిమిషాలు మౌనం పాటించింది. విద్యార్థుల పోరాటాలకు సంఘీభావం తెలుపుతూ అభివాదం చేశారు. ఇదే సందర్భంగా వెలువరించిన “సమరశీల స్ఫూర్తి పిడిఎస్యు”అనే పుస్తకాన్ని కోల్సే పాటిల్, ప్రొఫెసర్ హరగోపాల్ లు ఆవిష్కరించారు. అనంతరం ముఖ్య అతిథిలు మాట్లాడారు.

**జస్టిస్ జిబి. కోల్సే పాటిల్, హైకోర్టు రిటైర్డ్ జడ్జి:**

ఈ దేశాన్ని అనేక సామ్రాజ్యవాద దేశాలు పాలించాయి. ముఖ్యంగా బ్రిటిష్ సామ్రాజ్యవాదం 200 సంవత్సరాల పాలించి ఈ దేశాన్ని సర్వనాశనం చేశారన్నారు. ఈ స్థితికి కారణం సామ్రాజవాదపు దోపిడీ అన్నారు. దేశాన్ని ఏలిన పాలకులు కూడా దేశ ప్రజలని దోపిడి, పీడనలకు గురి చేశారన్నారు. అవినీతి, కుల, మతాలతో ధ్వంసం చేశారన్నారు. స్వాతంత్రం తర్వాత కూడా దేశాన్ని కులాలమయం చేశారన్నారు. అగ్రవర్ణ కుల ఆధిపత్యాన్ని కొనసాగించారని, బ్రాహ్మణీయ భావజాలాన్ని కొనసాగిస్తున్నారన్నారు. అధికారంలో 10 సంవత్సరాలు ఉన్న నరేంద్ర మోడీ, బిజెపి ప్రభుత్వం మరింత దారుణాలకు పూనుకుంటుందని, చరిత్రను వక్రీకరిస్తున్నారన్నారు. ప్రజాస్వామ్య హక్కులు కాలరాస్తూ, లక్షల కోట్ల బడ్జెట్లను ప్రజలకు కాకుండా సంపన్నులకు పంచుతున్నారన్నారు. రాజ్యాంగాన్ని, రాజ్యాంగ హక్కులను పాతరేస్తున్నారని, నిచ్చెనమెట్ల వ్యవస్థను పెంచి పోషిస్తున్నారని విమర్శించారు. వీటికి వ్యతిరేకంగా పిడిఎస్యు సమరశీల పోరాటాలను నిర్వహించాలని పిలుపునిచ్చారు.

**ప్రొఫెసర్ హరగోపాల్:**

దేశంలో సామాన్య ప్రజానీకానికి విద్య అందకుండా చేస్తున్నారన్నారు. 70 ఏళ్ల తర్వాత కూడా దేశంలో విద్యను అందించలేని స్థితి ఉందన్నారు. ఉన్నత విద్యను చదవడానికి వస్తున్న బహుజనులకు విద్యను అందకుండా చేసేట్లు పాలకవర్గాలు ప్రయత్నిస్తున్నాయన్నారు. ప్రభుత్వ యూనివర్సిటీలను నిర్వీర్యం చేస్తున్నాయని, వేలాది ఫ్యాకల్టీ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఇన్ని ఖాళీలతో ఎలా విద్యను అందిస్తారని ప్రశ్నించారు. సమానమైన, ఉచితమైన,నాణ్యమైన విద్య కోసం పిడిఎస్యు పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ సభలో హెచ్ సియూ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ , ఉస్మానియా ప్రొఫెసర్ కాశీం, ప్రొఫెసర్ కొండా నాగేశ్వరరావు, ప్రొఫెసర్ వినాయక రెడ్డి, డాక్టర్ గుమ్మడి అనురాధ, టిపిటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగిరెడ్డి, పూర్వ పిడిఎస్యు నాయకులు వడ్డెల్లి కృష్ణమూర్తి, తూల రాజేందర్, మనోహర్, రాజు, హన్వేష్, ఎస్ ఎల్ పద్మ, ఆవుల అశోక్, కేఎస్ ప్రదీప్, జూపాక శ్రీనివాస్ బోయినపల్లి రాము, ఆర్ రవికుమార్, సిహెచ్ శిరోమణి, పశ్చిమబెంగాల్ విద్యార్థి నాయకులు ప్రియం తదితరులు ప్రసంగించారు.

ఈ కార్యక్రమంలో పి డి ఎస్ యు రాష్ట్ర ఉపాధ్యక్షులు అనిల్ నరసింహారావు పృధ్వి నరేందర్ భాస్కర్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎర్ర అఖిల్ ప్రవీణ్ సాయికుమార్ కోశాధికారి సురేష్, రాష్ట్ర నాయకులు వెంకటేష్ , రాకేష్, తిరుపతి, అజయ్, గణేష్, అనిల్, కావ్య, నవీన్, నరేష్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.









# విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యత

**జిల్లా స్థాయి సమీక్షలో మంత్రి జూపల్లి.**

**ప్రభుత్వ కార్యక్రమాలు, పథకాల అమలుపై దిశానిర్దేశం.**

**పాల్గొన్న ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎమ్మెల్యేలు.**




**వేగుచుక్క న్యూస్,నిజామాబాద్, సెప్టెంబర్ 30**

విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యతనిస్తూ పనితీరులో స్పష్టమైన మార్పు తెస్తామని జిల్లా ఇంచార్జ్ మంత్రి, రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో మంత్రి జూపల్లి సోమవారం నిజామాబాద్ జిల్లా స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, శాసన సభ్యులు పి.సుదర్శన్ రెడ్డి, డాక్టర్ భూపతి రెడ్డి, పైడి రాకేష్ రెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు. కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు జిల్లాలో అమలవుతున్న ప్రభుత్వ కార్యక్రమాలు, సంక్షేమ పథకాల ప్రగతి గురించి మంత్రి దృష్టికి తెచ్చారు. వ్యవసాయం, విద్య, వైద్యం తదితర శాఖలపై సమీక్షలో సమగ్ర చర్చ జరిపారు. జిల్లాలో 71 వేల రైతు కుటుంబాలకు రూ. 626 కోట్ల రుణమాఫీ జరిగిందని కలెక్టర్ వివరించారు. పలు సాంకేతిక కారణాల వల్ల కొంతమందికి రుణమాఫీ జరుగలేదని, ఈ విషయమై ఉన్నతాధికారులకు పరిస్థితిని వివరిస్తూ నివేదికలు పంపామని అన్నారు.

ఈ సందర్భంగా ఇంచార్జ్ మంత్రి జూపల్లి అధికారులకు దిశా నిర్దేశం చేస్తూ, ప్రజలకు పారదర్శకమైన పాలన అందేలా కృషి చేయాలని హితవు పలికారు. అర్హులైన రైతులందరికీ తప్పనిసరిగా రూ. 2 లక్షల లోపు పంట రుణాలను మాఫీ చేస్తామని ఈ సందర్భంగా మంత్రి స్పష్టం చేశారు. పలు సాంకేతిక కారణాల వల్ల కొంతమంది రైతులకు రుణమాఫీ జరుగనందున, అలాంటి రైతులను క్షేత్రస్థాయిలో గుర్తించి సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని అధికారులను ఆదేశించారు. అవసరమైతే రాష్ట్ర స్థాయి అధికారులతో ప్రత్యేకంగా భేటీ అయ్యి సాంకేతిక ఇబ్బందులను అధిగమించి అర్హులైన ప్రతి రైతుకు రుణమాఫీ ద్వారా లబ్ది చేకూరేలా చూడాలన్నారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చాలా స్పష్టతతో ఉన్నారని మంత్రి వెల్లడించారు. విద్యాశాఖపై చర్చ సందర్భంగా, మంత్రి మాట్లాడుతూ, ప్రతి ప్రభుత్వ పాఠశాల, కళాశాలలో వసతులను మెరుగుపర్చి నాణ్యమైన విద్యా బోధన జరిగేలా పకడ్బందీ పర్యవేక్షణ జరపాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. తద్వారా ప్రభుత్వ విద్యా సంస్థల్లో ప్రవేశాలను గణనీయంగా మెరుగుపడేలా ప్రతిఒక్కరు అంకితభావంతో కృషి చేయాలని అన్నారు. పాఠశాలలకు ఆంగ్ల, తెలుగు దినపత్రికలు అందేలా చర్యలు తీసుకోవాలని, డిక్షనరీని సమకూర్చాలని తద్వారా విద్యార్థుల్లో సామర్థ్యం పెంపొందేందుకు ఇవి దోహదపడతాయని మంత్రి జూపల్లి ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రైవేట్ విద్యా సంస్థలతో పోలిస్తే, ప్రభుత్వ బడులలో నిపుణులు, విషయం పరిజ్ఞానం కలిగిన అధ్యాపకులు ఉంటారని, పేద విద్యార్థులకు బంగారు భవిష్యత్తును అందించేలా అంకిత భావంతో బోధన విధులు నిర్వర్తించాలని హితవు పలికారు. పాఠశాలల రేషనలైజేషన్ ప్రక్రియను వారం రోజుల్లో పూర్తి చేయాలని డీఈఓను ఆదేశించారు. వైద్య రంగంలోనూ స్పష్టమైన మార్పు కనిపించాలని, ప్రభుత్వ ఆసుపత్రుల పనితీరు పట్ల ప్రజల్లో నమ్మకం పెంపొందేలా నాణ్యమైన సేవలు అందించాలని సూచించారు. పాలిటెక్నిక్ కాలేజీని ఇంజనీరింగ్ కళాశాలగా అప్ గ్రేడ్ చేస్తాం కాగా, నిజామాబాద్ పాలిటెక్నిక్ కాలేజీని ఇంజనీరింగ్ కళాశాలగా అప్ గ్రేడ్ చేస్తామని మంత్రి జూపల్లి ప్రకటించారు. అదేవిధంగా తెలంగాణ యూనివర్సిటీకి అనుబంధంగా ఇంజనీరింగ్ కాలేజ్ ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన గురించి కూడా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి మంజూరు చేయించేందుకు

కృషి చేస్తామని అన్నారు. నిజాంసాగర్ ప్రాజెక్ట్ ను పర్యాటక ప్రదేశంగా తీర్చిదిద్దేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లా గ్రంథాలయంలో ఉద్యోగ శిక్షణార్థులకు భోజన వసతి ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. సమీక్ష సమావేశానికి ముందు మంత్రి జూపల్లి నిజామాబాద్ నగరంలో రూ. 6 కోట్లతో నిజామాబాద్ నుంచి నర్సీ రోడ్ మరమ్మతులు, రూ. 4.50 కోట్లతో నిజామాబాద్ - వర్ని రోడ్ మరమ్మతు పనులకు శంకుస్థాపనలు చేశారు. ఆర్మూర్ నవనాథ్ సిద్ధులగుట్టను దర్శించుకుని, ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, సహకార సంఘాల యూనియన్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి, మార్క్ ఫెడ్ చైర్మన్ గంగారెడ్డి, డీసీసీబీ చైర్మన్ రమేష్ రెడ్డి, ఐడీసీఎంఎస్ చైర్మన్ తారాచంద్, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, నగరపాలక సంస్థ కమిషనర్ మకరంద్, బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



## భూగర్భ జలాల పూర్తి నివేదికలను సిద్ధం చేయాలి.

**- జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్.**

**వేగుచుక్క న్యూస్, కామారెడ్డి, సెప్టెంబర్ 30:**



జిల్లాలో నీటి సంరక్షణ, భూ గర్భ జలాలు పెంపొందించే పనులకు సంబంధించిన పూర్తి నివేదికలను క్రోడీకరించి సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. సోమవారం రోజున కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో నీటి సంరక్షణ, భూ గర్భ జలాలు పెంచే పనులు, ప్లాంటేషన్ లకు సంబంధించినవి, పూర్తి చేయబడిన, చేయవలసిన పనులను గుర్తించి పూర్తి నివేదికలను సిద్ధం చేయాలని అన్నారు. అక్టోబర్ 8 నుండి 10 వరకు జిల్లాలో జలశక్తి అభియాన్ కేంద్రం బృందం పర్యటించనున్న సందర్భంలో సమావేశం ఏర్పాటు చేయడమైనదనీ తెలుపుతూ, జిల్లాలోని నీటి సంరక్షణకు సంబంధించిన నివేదికలను సంబంధిత శాఖల నుండి క్రోడీకరించి సిద్ధం చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్, జిల్లా పరిషత్ సీఈఓ చందర్, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ రావు, జిల్లా భూగర్భ శాఖాధికారి సతీష్ , జిల్లా వ్యవసాయ అధికారి తిరుమల ప్రసాద్, మున్సిపల్ కమీషనర్ సుజాత, జిల్లా పంచాయతీ రాజ్ ఈ ఈ దుర్గా ప్రసాద్, జిల్లా ఉద్యానవన అధికారిని జ్యోతి, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# విజయేందర్ రెడ్డి సేవలు ప్రశంసనీయం.

**- వీడ్కోలు కార్యక్రమంలో అభినందించిన ఎమ్మెల్యే, కలెక్టర్.**



**వేగుచుక్క న్యూస్,నిజామాబాద్, సెప్టెంబర్ 30 :**

నిజామాబాద్ జిల్లా రెవెన్యూ శాఖలో తహశీల్దార్ క్యాడర్ లో పదవీ విరమణ చేసిన కలెక్టరేట్ కార్యాలయ ఈ-సెక్షన్ పర్యవేక్షకుడు విజయేందర్ రెడ్డి అందించిన సేవలు ప్రశంసనీయం అని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు కొనియాడారు. విజయేందర్ రెడ్డి సోమవారం పదవీ విరమణ చేసిన సందర్భాన్ని పురస్కరించుకుని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో ఘనంగా వీడ్కోలు పలికారు. పూలమాలలు శాలువాలతో సత్కరించి, జ్ఞాపికను బహూకరించారు. రెవెన్యూ శాఖ ఉద్యోగిగా విధుల్లో చేరిన విజయేందర్ రెడ్డి ఎలాంటి రిమార్క్బ లేకుండా సర్వీస్ ను పూర్తి చేసుకోవడం ఎంతో గొప్ప విషయమని కలెక్టర్ అభినందించారు. సీ.సీ గా సుదీర్ఘ కాలం పాటు విధులు నిర్వర్తించడంతో పాటు ఎలాంటి బాధ్యతలు అప్పగించినా సమర్ధవంతంగా నిర్వర్తించారని అన్నారు. కాగా, విజయేందర్ రెడ్డి సేవలను భవిష్యత్తులో కూడా వినియోగించుకుంటామని ఎమ్మెల్యే అన్నారు. కలెక్టరేట్ లో సుదీర్ఘ కాలం పాటు వివిధ హోదాలలో ఆయన అందించిన సేవలను సహచర అధికారులు, సిబ్బంది సైతం కొనియాడుతూ, శేష జీవితం ఆయురారోగ్యాలతో సంతోషంగా గడపాలని ఆకాంక్షించారు. కాగా, తన ఉద్యోగ నిర్వహణలో సహకరించిన ప్రతి ఒక్కరికి విజయేందర్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్, అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్రకుమార్, రెవెన్యూ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రమన్, కలెక్టరేట్ ఏ.ఓ ప్రశాంత్, కలెక్టరేట్ ఉద్యోగులు పాల్గొన్నారు.

# నీట్ ఫలితాల్లో "ఆర్కిడ్స్" పూర్వ విద్యార్థుల ప్రతిభ.

**చెప్యాల సునైన రెడ్డి (272), డి. సంజన (4148) రాష్ట్ర స్థాయి ర్యాంకులు.**

**విద్యార్థులను అభినందించిన ప్రిన్సిపాల్ చెప్యాల గోవర్ధన్ రెడ్డి.**





**వేగుచుక్క న్యూస్, కామారెడ్డి, సెప్టెంబర్ 30:**

నీట్ పరీక్ష ఫలితాల్లో పట్టణంలోని అర్కిడ్స్ పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. నీట్ ఫలితాలు గత నెల 24 శుక్రవారం విడుదల కాగా, అందులో పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థులు చెప్యాల సునైన రెడ్డి, డి. సంజన రాష్ట్రస్థాయిలో ర్యాంకులు సాదించారు.

ఆర్కిడ్స్ పాఠశాలకు చెందిన చెప్యాల సునైన రెడ్డి, రాష్ట్ర స్థాయిలో 272వ, ర్యాంకు సాధించి ప్రతిభ కనబరచింది. "ఆర్కిడ్స్" ప్రిన్సిపాల్ చెప్యాల గోవర్ధన్ రెడ్డి, వసంతల మొదటి కూతురు

సునై నరెడ్డి చిన్నతనం నుండే చదువులో ప్రథమ స్థానంలో ఉండేది. "ఆర్కిడ్స్ హై స్కూల్' కామారెడ్డి లో చదివిన సునైన రెడ్డి పదవ తరగతిలో 10కి 10 జిపిఏ సాధించి పాఠశాల టాపర్ గా నిలిచింది. అనంతరం ఇంటర్మీడియట్ బైపిసి హైదరాబాద్ బాచుపల్లి శ్రీ చైతన్య కళాశాలలో చదివి 1000 కి 983 మార్కులను సాధించింది. 2024 లో జరిగిన నీట్ పరీక్షలలో 720కి 625 మార్కులతో తెలంగాణ మెడికల్ కౌన్సెలింగ్ లో మొదటి 'రౌండ్ లో " గాంధీ " మెడికల్ కాలేజ్ సికింద్రాబాద్ లో ఎంబిబిస్ సీటు సాధించింది. కాళోజీ నారామణ రావు యూనివర్సిటీ విడుదల చేసిన నీట్ ఫలితాలలో రాష్ట్ర స్థాయిలో 272వ ర్యాంకును సాధించిన సునైనారెడ్డిని ఆర్కిడ్స్ పాఠశాల మాజమాన్యం, పలువురు విద్యావేత్తలు అభినందించారు.అదే విధంగా మరొక విధ్యార్థిని డి. సంజన నీట్ ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో 4148వ ర్యాంకు సాధించి ప్రతిభ కనబరచింది. డి. శంకర్, యశోదల ప్రథమ కుమార్తె, చిన్నతనం నుండి బాగా చదువుతూ ఆర్కిడ్స్ పాఠశాలలో పదవతరగతిలో 10కి 10 జీపీఏ సాదించి పాఠశాల టాపర్గా నిలించింది. తర్వాత ఇంటర్మీడియట్ బైపిసి బాచుపల్లి శ్రీ చైతన్య కళాశాలలో చదువుకుంది. నీట్ పరీక్షలో 720కి 499 మార్కులతో - మెడికల్ కౌన్సిలింగ్ మొదటి రౌండ్ లో సిద్ధిపేట మెడికల్ కాలేజీలో ఎంబిబిస్ సీటు సాదించింది. పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు ఉత్తమ ర్యాంకులు సాధించడం పట్ల మాజమాన్యంతో పాటు పలువురు అభినందించారు.

# కోటీశ్వరుల్ని చేసిన సిప్..

మీరు ప్రతి నెలా సంపాదన నుంచి ఏమైనా పొదుపు చేస్తున్నారా? దీనిని పెట్టుబడులకు మళ్లిస్తున్నారా? అయితే మ్యూచువల్ ఫండ్లలో సిప్ విధానంలో మదుపు చేస్తే దీర్ఘకాలంలో మంచి రిటర్న్స్ అందుకోవచ్చు. నెలకు కొంత మొత్తంలో పెట్టుబడి పెట్టుకుంటూ పోతే కొన్నేళ్లలోనే ఎన్నో రెట్ల రాబడి వస్తుంది. ఇలా సిప్ విధానంలో కోటీశ్వరుల్ని చేసిన ఒక ఫండ్ గురించి చూద్దాం. మీరు చిన్నప్పుడు చక్రవడ్డీ (కాంపౌండ్ ఇంట్రెస్ట్) గురించి వినే ఉంటారు. ఇక్కడ తొలుత అసలుపై వడ్డీ వర్తిస్తే.. రెండో సంవత్సరంలో అసలుకు వచ్చిన వడ్డీ.. అసలు అవుతుంది. మళ్లీ దీనిపై వడ్డీ వస్తుంది. ఇలా ఏటా అసలు, వడ్డీ పెరుగుకుంటూ పోతూనే ఉంటుంది. దీంతో బంపర్ రిటర్న్స్ అందుకోవచ్చు. ఇక మ్యూచువల్ ఫండ్లలో ఇలా కాంపౌండ్ ఇంట్రెస్ట్తోనే రిటర్న్స్ ఎక్కువ వస్తాయని చెప్పొచ్చు. ప్రముఖ శాస్త్రవేత్త ఆల్బర్ట్ ఐన్స్టీన్ కాంపౌండింగ్ను ప్రపంచ ఎనిమిదో వింతగా అభివర్ణించారు. ఇదో మ్యాజిక్ అని చెబుతుంటారు నిపుణులు. అందుకే ఎక్కువ రాబడి అందుకునేందుకు చాలా మంది మ్యూచువల్ ఫండ్లలో పెట్టుబడులపై ఆసక్తి చూపిస్తుంటారు.

ఇలా కాంపౌండ్ ఇంట్రెస్ట్తో ఇన్వెస్టర్ల తలరాత మార్చిన ఒక మిడ్ క్యాప్ మ్యూచువల్ ఫండ్ గురించి తెలుసుకుందాం. మ్యూచువల్ ఫండ్లలో సిప్ విధానంపై చాలా మంది ఇంట్రెస్ట్ ఉంటుంది. ఇక్కడ ప్రతి నెలా కొంత మొత్తంలో పెట్టుబడి పెట్టుకుంటూ పోవొచ్చు. ఎడెల్వీస్ మిడ్ క్యాప్ ఫండ్ సగటున ఏడాదికి 20.1 శాతం చొప్పున రిటర్న్స్ ఇచ్చింది. ఇది లాంఛ్ అయి 16 సంవత్సరాలు అయింది.

నెలకు రూ. 10 వేల చొప్పున ఈ ఫండ్లో సిప్ ద్వారా పెట్టుబడి పెట్టుకుంటూ పోయినవారికి గణనీయమైన లాభాలు వచ్చాయి.

# కారు లోన్ కావాలా? ఏ బ్యాంకులో వడ్డీ రేట్లు ఎంతెంత?



మీరు లోన్ తీసుకుని కారు కొనుగోలు చేయాలని భావిస్తున్నారా? ఏ బ్యాంకులో తక్కువ వడ్డీ రేటు ఉందో తెలుసుకోవాలనుకుంటున్నారా? అయితే ఇది మీకోసమే. కారు లోన్లపై వివిధ బ్యాంకులు వసూలు చేసే వడ్డీ రేట్ల జాబితా ఇప్పుడు మనం తెలుసుకుందాం.

మన దేశంలో కార్లు కొనేవారి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. సొంత ఇల్లు, కారు అనేది సగటు భారతీయుడి కల. ఈ కొత్త ఏడాది 2024, జనవరి నెలలో దేశవ్యాప్తంగా ఏకంగా 3.94 లక్షల కార్ల విక్రయాలు జరిగాయంటేనే తెలుస్తోంది ఏ స్థాయిలో కార్లకు డిమాండ్ ఉందో అని. ఇందుకు చాలా కారణాలే ఉన్నాయి. అందులో ప్రధానమైనది దాదాపు అన్ని బ్యాంకులు కార్ల కొనుగోలుకు విరివిగా లోన్లు మంజూరు చేయడం. తక్కువ వడ్డీకే రుణాలు అందిస్తుండడం అని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. బ్యాంకులు క్రెడిట్ స్కోర్ 750, అంత కంటే ఎక్కువగా ఉన్న వారికి తక్కువ వడ్డీకే లోన్స్ ఇస్తున్నాయి. అలాగే చాలా బ్యాంకులు కారు ఆన్ రోడ్ ధలో 80 శాతం నుంచి 90 శాతం వరకు రుణాలు ఇస్తున్నాయి. దీంతో కొత్త కారు కొనుగోలు చేయాలని భావిస్తున్న వారు ఈజీగా లోన్ పొంది తమ కలను నెరవేర్చుకుంటారు. మీరు కూడా కొత్త కారు కొనుగోలు చేయాలనుకుంటే బ్యాంకులు విధించే వడ్డీ రేట్లు, ప్రాసెసింగ్ ఫీజులు, రీపేమెంట్ ఛార్జీల వంటి వాటి గురించి తెలుసుకోవడం మంచిద. ఇప్పుడు వివిధ బ్యాంకుల్లో కారు లోన్లపై వడ్డీ రేట్లు ఎలా ఉన్నాయో తెలుసుకుందాం. కెనరా బ్యాంకులో కారు లోన్లపై వార్షిక వడ్డీ రేటు 8.70 శాతంగా ఉంది.యూనియన్ బ్యాంకులో కారు రుణాలపై సంవత్సరానికి వడ్డీ రేటు 8.70 శాతం నుంచి మొదలవుతోంది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో కారు లోన్లపై వార్షిక వడ్డీ 8.75 శాతం నుంచి ప్రారంభమవుతుంది.




# ఐటం పాటల్లో పాండే బ్యూటీ కండీషన్లు!



ఐటం పాటలకు ఏ నటి ఒకే చెప్పినా? పెద్దగా కండీషన్లు అంటూ ఏవీ లేకుండానే నటిస్తున్నారు . ఐటం పాట అంటేనే యువతలో ఊపు తెచ్చేది. ఆపాటని కమర్శియల్ కోణంలో డిజైన్ చేసి సినిమాల్లో పెడు తుంటారు. ఆ పాట కోసం స్టోరీ డిమాండ్ చేయాల్సిన పనిలేదు. సన్నివేశానికి నాన్ సింక్ అవుతుంది? అనే అవసరం లేదు. కమర్శియల్ సినిమా అయినా..పీరియాడిక్ స్టోరీ అయినా హాట్ బ్యూటీతో ఐటం పాట అన్నది? ఓ స్పెషల్ గా భావిస్తారంతా.ఈ కల్చర్ దాదాపు అన్ని భాషల్లోనూ ఉంది. ముఖ్యంగా టాలీవుడ్..బాలీవుడ్..కోలీవుడ్లో కనిపిస్తుంటుంది. ఐటం పాటల్లో స్టార్ హీరోయిన్లే నటిస్తున్నారు. ఎలాంటి కండీషన్లు పెట్టకుండా అందాలు ఆరబోస్తున్నారు. హీరోయిన్లు ఇలాంటి టర్నింగ్ తీసుకోవడంతో ప్రొఫెషనల్ ఐటం గాల్స్ కి డిమాండ్ తగ్గిందన్నది వాస్తవం. ఫాంలో ఉన్నా లేకపోయినా? మంచి పారితోషికం వస్తుందంటే నో చెప్పకుండా పనిచేస్తున్నారు.తాజాగా లైగర్ బ్యూటీ అనన్యా పాండే కూడా ఐటం పాటలకు గ్రీన్ సిగ్నెల్ ఇచ్చింది. అయితే అమ్మడు ఇక్కడ కండీషన్లు అప్లై అంటోంది. అన్ని సినిమాల్లోనూ ఐటం పాటల్లో నటించనని...కేవలం ఐటం పాటలు డిమాండ్ చేసే సినిమాలు తప్ప! మిగతా సినిమాల్లో అవకాశాలు వచ్చిన అలాంటి పాటలు చేయనంటోంది.పాటలో అమ్మాయికి ప్రాధాన్యతతో పాటు, దాన్ని గౌరవంగా భావించేలా ఉండాలి అంటోంది.అలాంటప్పుడే ఐటం పాటలో నటిస్తుందిట. తన నియమాలకు అనుగుణంగా ఐటం పాటలు వస్తే చేస్తాను తప్ప లేదంటే నిర్మొహమాటంగా నో చెప్పాస్తాను అంది. ఐదేళ్ల నట జీవితంలో ఇంతవరకూ ఐటం పాటలు చేయలేదు. వస్తే మాత్రం ఇలాండి కండీషన్లు మద్య ఒకే చెబుతుందిట.



# తండేల్‌లో నాగచైతన్య.. సాయిపల్లవి డ్యాన్స్ సాంగ్

నవ యువ సామ్రాట్ నాగచైతన్య, లేడీ పవర్‌స్టార్ సాయి పల్లవి జంటగా నటిస్తోన్న రెండో చిత్రం 'తండేల్' పాన్ ఇండియాగా రూపొందుతున్న ఈ మూవీకి కార్తికేయ2 ఫేం చందూ మొండేటి దర్శకత్వం వహిస్తుండగా అల్లు అరవింద్ సమర్పణలో ప్రతిష్టాత్మక గీతా ఆర్ట్స్2 బ్యానర్‌పై బన్నీ వాస్ నిర్మించారు. శ్రీకాకుళం జిల్లా డి.మచ్చిలేశం గ్రామంలో జరిగిన నిజ జీవిత సంఘటనల ఆధారంగా ఈ తండేల్ సినిమాను తెరకెక్కించడం విశేషం. వాస్తవ ఘటనలతో రూపొందిస్తున్న ఈ సినిమాలో ఇద్దరు ప్రేమికుల మధ్య వారి జీవితాల్లో సంభవించిన పరిస్థితులు, భావోద్వేగాలు ఇతర పరిస్థితులను చాలా గ్రిప్పింగ్‌గా, ఆకర్షణీయంగా తెరపై మలుస్తున్నాడు దర్శకుడు చందు మొండేటి. అదేవిధంగా దక్షిణ కాశీగా పేరుగాంచిన శ్రీకాకుళంలోని పురాతన శివాలయం శ్రీముఖలింగం సన్నిధిలో ప్రతి ఏటా అంగరంగ వైభవంగా నిర్వహించే మహాశివరాత్రి ఉత్సవాలను ప్రేరణగా తీసుకుని ఈ సినిమా కోసం మునుపెన్నడూ చూడని రీతిలో ఓ ప్రత్యేక శివరాత్రి పాటను ప్లాన్ చేస్తున్నారు మేకర్స్. ఈ క్రమంలో ఇప్పటికే శివరాత్రి ఉత్సవ వైభవాన్ని తెలియజేసేలా భారీ సెట్టింగ్‌లు మరియు అత్యంత వ్యయంతో అవార్డ్ విన్నింగ్ మ్యూజిక్ డైరెక్టర్ దేవీ శ్రీ ప్రసాద్ సంగీతం అందించగా శేఖర్ మాస్టర్ నృత్య దర్శకత్వంలో ఓ పాటను చిత్రీకరించారు. ఈ పాటలో నాగ చైతన్య, సాయి పల్లవిలతో పాటు వేలాది మంది డ్యాన్సర్‌లతో కలిసి డ్యాన్స్ చేశారు. అయితే ఈ పాట నాగ చైతన్య సాయి పల్లవిల కెరీర్‌లోనే మోస్ట్ స్పెషల్ సాంగ్స్ లో ఒకటిగా ఉండబోతుండగా దసరా పర్వదినం సందర్భంగా త్వరలోనే ఈ సాంగ్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి చిత్ర యూనిట్ ప్రయత్నం చేస్తోంది. ఈ మేరకు తాజాగా పాట షూటింగ్ సందర్భంగా తీసిన ఫొటోలను మేకర్స్ విడుదల చేశారు. కాగా ఈ సినిమాను సంక్రాంతికి విడుదల చేసేందుకు రెడీ అవుతున్నారు. త్వరలోనే అధికారికంగా రిలీజ్ డేట్ పోస్టర్‌ను విడుదల చేయనున్నారు.

# జీబ్రా మూవీ టీజర్ విడుదల




యువ నటుడు సత్యదేవ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'జీబ్రా' లక్ ఫేవర్స్ ది బ్రేవ్.. అన్నది ఉపశీర్షిక. ఈ సినిమాకు ఈశ్వర్ కార్తీక్ దర్శకత్వం వహిస్తుండగా.. ఓల్డ్ టౌన్ పిక్చర్స్, పద్మ ఫిలిమ్స్ బ్యానర్‌పై ఎస్ఎన్ రెడ్డి, బాలసుందరం, దినేష్ సుందరం సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ మూవీని అక్టోబర్ 31న తెలుగుతో పాటు తమిళం, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో విడుదల చేయబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే తాజాగా టీజర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్. ఈ టీజర్ చూస్తుంటే యాక్షన్ క్రైమ్ కామెడీగా ఈ సినిమా రాబోతున్నట్లు తెలుస్తుంది. మత్తు వదలరా ఫేం సత్య కూడా టీజర్‌లో మరోసారి నవ్వులు పూయించాడు. ప్రియా భవానీ శంకర్ , జెన్నిఫర్ కథానాయికలుగా నటిస్తున్న ఈ చిత్రంలో పుష్పా సినిమాతో ఫేమస్ అయిన ధనంజయ (జాలిరెడ్డి) విలన్ పాత్రలో నటిస్తున్నాడు. సునీల్ సత్యరాజ్ తదితరులు ఈ సినిమాలో కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

# కనకదుర్గమ్మను దర్శించుకున్న కార్తీ



ప్రముఖ తమిళ నటుడు కార్తి విజయవాడ కనకదుర్గ అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయన నటించిన 'సత్యం సుందరం' చిత్ర ప్రచారంలో భాగంగా కార్తీ విజయవాడ వచ్చారు. చిత్ర బృందంలో కలిసి ఇంద్రకీలాద్రికి వచ్చిన కార్తికి ఆలయ అధికారులు స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనం అనంతరం పండితులు వేదాశీర్వచనం చేసి అమ్మవారి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. 2013లో ఓసారి దుర్గమ్మను దర్శించుకునేందుకు వచ్చానని కార్తి చెప్పారు. మళ్లీ ఇప్పుడు కనకదుర్గమ్మ సన్నిధికి రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. ప్రజలంతా సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. 'సత్యం సుందరం' చిత్రం మంచి ఆదరణ పొందుతోందని సంతోషం వ్యక్తం చేశారు.

# నారాయణమంత్రంపై కీరవాణి ఆడియో

## అభినందించిన డిప్యూటి సిఎం పవన్



ఆస్కార్ విజేత, ప్రముఖ సంగీత దర్శకుడు ఎం. ఎం. కీరవాణికి ధన్యవాదాలు తెలుపుతూ ఏపీ డిప్యూటీ సీఎం, పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ఓ ప్రకటనను విడుదల చేశారు. తిరుమల మహా ప్రసాదం అయిన లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వినియోగంపై పవన్ కళ్యాణ్ ఈ ఆవేదన నిమిత్తం ప్రాయశ్చిత్త దీక్షను చేపట్టిన విషయం తెలిసిందే. ప్రాయశ్చిత్త నిమిత్తం అంతా నారాయణ మంత్రం పఠిస్తున్నారు. అలా నారాయణ మంత్రం పఠించే వారందరి కోసం సంగీత దర్శకుడు కీరవాణి ఓ ఆడియో రికార్డ్ చేశారు. ఆడియో రికార్డ్ చేసిన కీరవాణికి, ఆయన టీమ్‌కు ధన్యవాదాలు తెలుపుతూ.. జనసేన పార్టీ తరపున పవన్ కళ్యాణ్ అధికారికంగా ఓ ప్రకటనను విడుదల చేశారు. అందులో.. 'ఓం నమో నారాయణాయ' మంత్రాన్ని ప్రజానీకం పఠించేందుకు అనువుగా ఆడియో రికార్డు రూపొందించిన ప్రముఖ సంగీత దర్శకులు ఎం.ఎం. కీరవాణిగారికి మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. తిరుమల మహా ప్రసాదం లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వినియోగం భక్తి భావం కలిగిన ప్రతి ఒక్కరికీ తీవ్ర ఆవేదన కలిగించింది. ఈ ఆవేదన నుంచే ప్రాయశ్చిత్త దీక్ష ప్రారంభించాను. ఈ దీక్షకు సంఘీభావంగా జనసేన నాయకులు, వీర మహిళలు, జన సైనికులతో పాటు ధార్మిక విశ్వాసాలు కలిగినవారందరూ ఆలయాల్లో పూజలు, హోమాలు, భజనలు చేస్తున్నారు. వారంతా ఓం నమో నారాయణాయ మంత్రం పఠిస్తున్నారు. అందుకు అనువుగా కీరవాణి ఆడియో రికార్డు చేశారు. భక్తి భావంతో సాగింది. ఇందులో భాగం పంచుకున్న సంగీత కళాకారులకి, సాంకేతిక నిపుణులకి ధన్యవాదాలు. ధర్మో రక్షతి రక్షిత:' అని పేర్కొన్నారు.

# మిథున్‌కు తోటి నటుల ప్రశంసలు



ఫాల్కే అవార్డుపై పవన్, బాలయ్య హర్షం

అత్యంత ప్రతిష్టాత్మకమైన 'దాదా సాహెబ్ ఫాల్కే' అవార్డుకు ఎంపికైన మిథున్ చక్రవర్తికి ప్రస్తుతం శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. ఏపీ డిప్యూటీ సీఎం మరియు పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ మిథున్ చక్రవర్తికి అభినందనలు తెలుపుతూ ఓ ప్రకటనను విడుదల చేశారు. ప్రముఖ నటులు, రాజ్యసభ సభ్యులు

మిథున్ చక్రవర్తిగారికి దాదాసాహెబ్ ఫాల్కే పురస్కారం ప్రదానం చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం సంతోషాన్ని కలిగించింది. మిథున్ చక్రవర్తిగారికి హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నాను. హిందీ, బెంగాలీ చిత్ర పరిశ్రమలో తనదైన ముద్ర వేశారు. 80వ దశకంలో దేశవ్యాప్తంగా యువతపై ఆయన ప్రభావం ఉంది. 'డిస్కో డ్యాన్సర్' చిత్రం ద్వారా ఆయన నృత్య శైలులు ఉర్రూతలూగించాయి. 'ఐ యామ్ ఏ డిస్కో డ్యాన్సర్...' అనే పాటను ఎవరూ మరచిపోలేరు. అని పేర్కొన్నారు. నటసింహం నందమూరి బాలకృష్ణ 'దాదా సాహెబ్ ఫాల్కే' పురస్కారానికి ఎంపికైన మిథున్ చక్రవర్తికి అభినందనలు తెలుపుతూ ఓ లేఖను విడుదల చేశారు.

ఇందులో..విలక్షణ నటుడు, మిత్రుడు మిథున్ చక్రవర్తికి ప్రతిష్ఠాత్మకమైన దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు ప్రకటించడం హర్షించదగ్గ విషయం. తొలి చిత్రం 'మృగయా'తోనే నటునిగా తనదైన బాణీ పలికించి, జాతీయ స్థాయిలో ఉత్తమ నటునిగా నిలిచారు మిథున్ చక్రవర్తి. ఆరంభంలో వాస్తవ చిత్రాలతో సాగినా, తరువాత బాలీవుడ్ కమర్షియల్ మూవీస్‌లో తనకంటూ ఓ ప్రత్యేక స్థానం సంపాదించారు మిథున్. ముఖ్యంగా 'డిస్కో డాన్స్'కు మిథున్ చక్రవర్తి విశేషమైన పేరు సంపాదించి పెట్టారు. మిథున్ చక్రవర్తితో నాకు చిత్రబంధం ఉంది- అదెలాగంటే నేను సోలో హీరోగా బయటి సంస్థల చిత్రాలలో నటించడానికి తొలిసారి కెమెరా ముందుకు వచ్చిన చిత్రం 'డిస్కో కింగ్'. ఈ చిత్రానికి మిథున్ చక్రవర్తి హిందీ సినిమా 'డిస్కో డాన్సర్' ఆధారం. అలా మా ఇద్దరికీ చిత్రబంధం ఉంది. భారతీయ చలనచిత్ర పరిశ్రమలో అత్యుత్తమమైన 'దాదాసాహెబ్ ఫాల్కే' అవార్డుకు ఎంపికైన మిథున్ చక్రవర్తికి నా హృదయపూర్వక శుభాభినందనలు. మిథున్ నటునిగా మరెన్నో విలక్షణమైన పాత్రలలో మురిపిస్తూ సాగాలని ఆశిస్తున్నాను..' అంటూ నందమూరి బాలకృష్ణ ఈ లేఖలో పేర్కొన్నారు.





# మిథున్‌కు దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు

## ప్రధాని మోడీ అభినందనలు



మన దేశంలో సినీ రంగానికి సంబంధించి ప్రతిష్ఠాత్మకంగా భావించే అవార్డుల్లో 'దాదా సాహెబ్ ఫాల్కే' ప్రధానమైనది. ఈ ఏడాది అవార్డుకు ప్రముఖ నటుడు మిథున్ చక్రవర్తి ఎంపికైనట్టు కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ తాజాగా ప్రకటించింది. అక్టోబర్ 8న జరగనున్న జాతీయ చలనచిత్ర అవార్డుల ప్రదానోత్సవంలో ఆయన ఈ పురస్కారాన్ని అందుకోనున్నారు. ఈ విషయాన్ని తెలియజేస్తూ కేంద్ర, సమాచార మంత్రి అశ్విని వైష్ణవ్ పోస్ట్ పెట్టారు. మిథున్ చక్రవర్తి అద్భుతమైన సినీ ప్రయాణం ఎంతోమందికి స్ఫూర్తిదాయకం. భారతీయ చిత్ర పరిశ్రమకు ఆయన చేసిన సేవలు గుర్తించి ఈ ఏడాది దాదా సాహెబ్ ఫాల్కే పురస్కారం ఆయనకు అందించాలని జ్యూరీ నిర్ణయించిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ.. మిథున్ చక్రవర్తికి శుభాకాంక్షలు తెలిపారు. భారతీయ చలన చిత్ర రంగానికి ప్రముఖ నటుడు మిథున్ చక్రవర్తి చేసిన అపారమైన సేవలను గుర్తించి ఆయనకు ప్రతిష్ఠాత్మక దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు ప్రకటించడం ఆనందంగా ఉంది. విభిన్నమైన నటనతో ఆయన ఎన్నో తరాలను అలరించారు. ఎంతోమంది అభిమానాన్ని పొందారు. ఆయనకు నా అభినందనలని ప్రధాని పేర్కొన్నారు. ఈ పురస్కారానికి తాను ఎంపిక కావడంపై మిథున్ ఆనందం వ్యక్తంచేశారు. మాటలు రావడం లేదు. ఇలాంటి గొప్ప విజయాన్ని నేను అస్సలు ఊహించలేదు. చాలా సంతోషంగా ఉన్నా. నా కుటుంబానికి, ప్రపంచవ్యాప్తంగా ఉన్న అభిమానులకు దీనిని అంకితం చేస్తున్నానని తెలిపారు. పశ్చిమబెంగాల్‌కు చెందిన మిథున్ చక్రవర్తి.. బాలీవుడ్‌లో ఎన్నో చిత్రాల్లో యాక్ట్ చేసి పేరు ప్రఖ్యాతులు సొంతం చేసుకున్నారు. హీరోగానే కాకుండా సహాయనటుడు, విలన్‌గా కూడా ఆయన ఎంతోమంది స్టార్ హీరోల చిత్రాల్లో నటించారు. 1976లో 'మృగాయ'తో నటుడిగా ఎంట్రీ ఇచ్చారు. తొలి చిత్రంతోనే ఉత్తమ నటుడిగా జాతీయ అవార్డు అందుకున్నారు. 'ముక్తి', 'బన్సారీ', 'అమర్‌దీప్', 'ప్రేమ్ వివాహ్', 'భయానక్', 'కస్తూరి', 'కిస్మత్', 'మే ఔర్ మేరా సాథి', 'సాహస్', 'వాంటెడ్', 'బాక్సర్', 'త్రినేత్ర', 'దుష్మన్', 'దలాల్', 'భీష్మ', 'సుల్తాన్', 'గురు', 'కిక్', 'బాస్', డిస్కోడాన్సర్ వంటి చిత్రాలు ఆయనకు గుర్తింపు తెచ్చిపెట్టాయి. హిందీ, బెంగాలీ చిత్రాలతోపాటు కన్నడ, తెలుగు, ఒరియా, భోజ్‌పురి చిత్రాల్లోనూ ఆయన నటించారు. 'గోపాల గోపాల'తో తెలుగు వారికి సుపరిచితమయ్యారు. ఇందులో ఆయన ప్రతినాయకుడిగా కనిపించారు. అనంతరం 'మలుపు' అనే టాలీవుడ్ మూవీలోనూ ఆయన యాక్ట్ చేశారు. 'ఐ యామే డిస్కో డాన్సర్' అన్న పాటతో దేశవిదేశాల్లో గుర్తింపు తెచ్చుకొన్నారు. ఈ ఏడాది ఆరంభంలో ఆయనకు పద్మభూషణ్ అవార్డును కేంద్రం అందజేసింది.